## క్లుప్తంగా

### విద్యార్థినులకు పరీక్ష అట్టల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే 270 మంది విద్యార్థినులకు గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ (అట్ట)లను పంపిణీ చేశారు. విద్యార్థినులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, సభ్యులు సునీల్‌రెడ్డి, వినోద్‌జైన్, భరత్‌షా, సాబీర్‌బాషా, హుసేన్ బాషాలు పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు సందీప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు పదో తరగతి పరీక్షలకు ముందు సరస్వతిపూజ చేయడం మంచి శుభ పరిణామమని చెప్పారు. పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీనియార్టీ జాబితాలో తప్పులను సవరించాలి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో ఉన్న తప్పులను సవరించాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ. సుంకన్న కోరారు. గురువారం ఎస్టీయూ భవనంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఇటీవల విద్యాశాఖ విడుదల చేసిన సీనియార్టీ జాబితాలో తప్పులు తడకగా ఉన్నట్లు తెలిపారు. సీనియార్టీ జాబితాలో క్యాడర్, ఉద్యోగంలో చేరిన తేదీ, డీఎస్సీలో ర్యాంకులు వంటివి సరిగా లేవన్నారు. తప్పులను సరిచేసి మరోకసారి సీనియార్టీ జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గోపాల్, ఎస్టీయూ నాయకులు అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

### శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థుల ఆవిష్కరణలను తిలకిస్తున్న పురపాలక ఉపాధ్యాయుడు ఫయాజుద్దీన్

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి సైన్స్ అండ్ టెక్నాలజీలో శాస్త్రవేత్తలుగా ఎదగాలని పురపాలక ఉపాధ్యాయుడు ఫయాజుద్దీన్, మోహన్ రావు సూచించారు. స్థానిక మిల్టన్ పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్‌బాబు అధ్యక్షతన సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. చదువుతో పాటు టెక్నాలజీ రంగాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. నేడు సైన్స్ అండ్ టెక్నాలజీలో అన్ని దేశాలు మనవైపు చూసే విధంగా మన శాస్త్రవేత్తలు ఎదగారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, సైన్స్ ఉపాధ్యాయులు రంగస్వామి, సీఈఓ వెంకటేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అభివృద్ధితోనే ప్రపంచ స్థాయి గుర్తింపు

ఆదోని రూరల్: దేశాలు అభివృద్ధి బాటలో నడిచినప్పుడే ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని సీనియర్ జర్నలిస్ట్ చార్లెస్ అన్నారు. పట్టణంలోని మహల్తి ఫంక్షన్‌హాల్‌లో గురువారం పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా స్టూడెంట్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. పాలస్తీనా జాతిహననమే లక్ష్యంగా ఇజ్రాయిల్ 15 నెలలపాటు సాగించిన యుద్ధంలో 45 వేలకు పైగా పాలస్తీనియన్లు మరణించారన్నారు. దేశాల మధ్య సమైక్యతాభావం ఉండాలని, కాల్పులను విరమించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, వీరేష్, కళాశాల లెక్చరర్ బడే సాబ్, వివిధ సంఘాల నాయకులు నరేష్ ఆచారి, వెంకప్ప తదితరులు పాల్గొన్నారు.

### కౌతాళం దర్గాలో భక్తుల సందడి



ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రంజాన్ మాసం కావడంతో భక్తులు దర్గాలోనే ఇఫ్తార్ చేశారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

# వాహనదారులూ తస్మాత్ జాగ్రత్త!

- అమలులోకి వచ్చిన నూతన నిబంధనలు
- కఠినతరంగా అమలు చేస్తున్న రవాణ, పోలీసు అధికారులు
- అతిక్రమిస్తే భారీగా జరిమానాలు
- ఆదోనిలో మార్చి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 20 కేసులు





డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ గంగాధర్, ఆదోనిలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు (ఫైల్)

ఆదోని అర్బన్/గోనెగండ్ల : వాహన యజమానులు ఇక జాగ్రత్త పడాల్సిందే. రహదారి నిబంధనలు సరిగా అమలు చేయడం లేదంటూ పోలీసు, రవాణాశాఖ అధికారులపై ఇటీవల హైకోర్టు ధర్మాసనం అక్షింతలు వేసింది. దీంతో ఈనెల 1వ తేదీ నుంచి నిబంధనలను రవాణా, పోలీసు అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

**ఐదు రోజుల్లో 20 కేసులు నమోదు**

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పిల్లాడు బండి నడుపుతాడని సంబరపడి మైనర్లకు బండి ఇప్పిస్తున్నారు. కేరింతలు కొడుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఇన్సూరెన్స్, రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్నారు. మద్యం సేవించి వేగంగా వాహనాలను, ఇష్టానుసారంగా నడిపిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల ఇతరులు బలవుతున్నారు. ప్రమాదాలను అదుపు చేయాలని, ప్రమాదాలకు గురై వాహనదారుడు కుటుంబ సభ్యులు రోడ్డున పడకూడదని నిబంధనలు పక్కాగా అమలు చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశాల జారీ చేయడంతో రవాణ, పోలీసు శాఖ అధికారులు ఈనెల 1వ తేదీ నుంచి నిబంధనలు పక్కాలు అమలు చేస్తున్నారు. ఈ ఆదోని పట్టణంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 50 కేసులు నమోదు కాగా, నూతన నిబంధనలు అమలులోకి వచ్చాక ఐదు రోజుల్లోనే 20 కేసులు నమోదు చేసి రూ.10వేలు జరిమానా విధించారు.

**మైనర్లకు వాహనాలను ఇస్తే భారీ జరిమానా**

గతంలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దవారికి శిక్ష పడేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ.5 వేలు జరిమానా విధిస్తారు. అలాగే మూడేళ్ల జైలు శిక్షపడే అవకాశం ఉంది.

**నూతన మోటార్ వాహన చట్టం ప్రకారం జీవో నంబర్ 21 ప్రకారం జరిమానాలు ఇలా...**

- ➡ లైసెన్సులు లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5 వేలు
- ➡ హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000, వెనుక కూర్చొన్న వారికి కూడా రూ.1000 జరిమానా, రెండోసారి దొరికితే మూడు నెలలు లైసెన్సులు రద్దు
- ➡ అతివేగంగా వాహనం నడిపితే రూ.1000
- ➡ రాంగ్‌రూట్‌లో వాహనం నడిపితే రూ.5 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా
- ➡ డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే రూ.10 వేలు జరిమానా
- ➡ సీటుబెల్టు ధరించకుండా కారు నడిపితే రూ.1000, రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు మూడు నెలల లైసెన్సు రద్దు
- ➡ అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళ్తే రూ.10 వేలు జరిమానా
- ➡ ద్విచక్రవాహనదారులు త్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.1000, మూడు నెలల లైసెన్సు రద్దు
- ➡ ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ.2 వేలు
- ➡ శబ్దం, పొగ కాలుష్యానికి పాల్పడితే రూ.2 వేలు
- ➡ ప్రయాణికులను రవాణా వాహనాల్లో ఎక్కిస్తే ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా
- ➡ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే రూ.1500
- ➡ రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా
- ➡ యూనిఫాం లేకుండా ఆటో నడిపితే రూ.150, రెండోసారి పట్టుబడితే రూ.300
- ➡ వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే రూ.2 వేలు జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.5 వేలు జరిమానా

**పెద్దలు, ప్రజల్లో మార్పు రావాలి**

రోడ్డు ప్రమాదాల నివారణ, శబ్ద కాలుష్యం తదితర ఇబ్బందులను పరిష్కరించే ఉద్దేశంతో హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వుల ప్రకారం మోటార్ వాహనాల చట్టం నూతన జరిమానాలు ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. ప్రజల్లో మార్పు రావాలి. అంతేగాకుండా పెద్దలు, ప్రముఖులు, రాజకీయ నాయకుల్లో పూర్తిస్థాయిలో మార్పు రావాలి. నిబంధనలు అతిక్రమించిన వారిని పట్టుకుంటే వెంటనే అధికారులకు ఫోన్ చేసే అలవాటు మానుకునేలా మార్పు రావాలి. ఇలా నిబంధనలు అతిక్రమించిన వారికి ప్రోత్సాహం ఇస్తే మరింత ప్రమాదాలు జరుగుతాయి. ప్రమాదాలను ప్రోత్సహించిన వారవుతారు. ఇలాగాకుండా ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

– గంటా సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ

**కఠిన చర్యలు తప్పవు**

నూతన మోటారు వాహన చట్టంలోని నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలను నివారించేందుకు కృతమవంతుగా కృషి చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు ప్రభుత్వం కూడా నూతన మోటార్ వాహన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. రహదారి పక్కన వాహనాలు నిలపరాదు. వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలి. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలి.

– ఏ.గంగాధర్, సీఐ, గోనెగండ్ల

## మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: మహిళలు ధైర్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని డీఎస్పీ హేమలత అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల్లో మహిళలతో కలిసి డీఎస్పీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోట్ల కూడలిలో మానవహారం నిర్వహించారు.

## సారాతో జీవితాలు ఛిద్రం



ఇందిరానగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: నాటుసారా తయారీ, అమ్మకాల వల్ల జీవితాలు ఛిద్రమవుతాయని ఆదోని ఎక్సైజ్ సీఐ ఎస్.కె.సైదుల్లా అన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌లో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. పెద్దకడబూరు:నాటుసారా రహిత గ్రామాలే నవోదయం 2.0 లక్ష్యం అని ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్‌సాగర్ అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో గురువారం నాటుసారా రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా జోలికి వెళ్లమని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు.

### ఘనంగా ఫార్మసీ దినోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఫార్మసీ కాలేజీలో గురువారం జాతీయ ఫార్మసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాగేష్, ప్రొఫెసర్ రంగారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ రంగం మన ఆరోగ్య వ్యవస్థలో చాల ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. వ్యాస రచన చిత్రకళ, వాచిక పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

## రంజాన్ కిట్ల పంపిణీ



ముస్లింలకు కిట్లను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎస్‌డీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఖురేషి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాసదీక్షలుండే పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల కిట్లను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ షుకూర్, ప్రభుత్వ ఖాజీ హఫీజ్ అతావుల్లా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.3వేల విలువచేసే కిట్లను అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఎస్‌డీపీఐ పట్టణ కార్యదర్శి హుసేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆదర్శ’ విద్యకు అవకాశం

- మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం
- మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, రచ్చుమర్రి, పెద్దకడబూరు మండలాలలో ఆదర్శ పాఠశాలలు



కోసిగి బాలికల పాఠశాలలలో అవగాహన కల్పిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరారెడ్డి

కోసిగి: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్స్) లలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలయ్యింది. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడబూరు, రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లలో 100 సీట్లు చొప్పున కేటాయించారు.

**6వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు అవకాశం**

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుకునే అవకాశం కల్పించారు. ప్రతి తరగతి సబ్జెక్ట్ వారీగా ఆంగ్లంలోనే నైపుణ్యం, ప్రతిభ కలిగిన అధ్యాపకులచే క్లాస్‌లు నిర్వహించి ఉత్తమ విద్యార్థులుగా రాణించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఉంటుంది. ఇదే పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో ఇతర ప్రాంతాలకు, ఇతర కళాశాలలకు వెళ్లకుండా మొదటి ప్రాధాన్యతగా సీటు కేటాయిస్తారు. మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఏ ర్పాటు చేశారు. ప్రతి గ్రూపుకు 40 సీట్లు ఉంటాయి.

**బాలికలకు హాస్టల్ వసతి**

ఏపీ మోడల్ స్కూల్‌లో సీటు సాధించి విద్యార్థినులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు అవకాశం కల్పిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి తరగతి 25 మంది చొప్పున మొత్తం 100 మందికి వసతి అవకాశం ఉంటుంది.

**6వ తరగతి దరఖాస్తులు ఇలా..:**

- ➡ 2025–2026 విద్యా సంవత్సరంకు గానూ గత 24వ తేది నుంచి నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం కల్పించారు.
- ➡ దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఆన్‌లైన్ పేమెంట్స్‌కు మార్చి 31వ తేదిన గడువు ముగియనుంది.
- ➡ cse. ap. gov. in లేదా apms. ap. gov. in వెబ్ సైట్‌లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.
- ➡ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆయా మోడల్ స్కూల్‌లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- ➡ ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు/ఇంగ్లీష్ మీడియంలో ఉంటుంది.
- ➡ మెరిట్ లిస్ట్ ఆధారంగా రోస్టర్‌ప్రకారం సీట్లు కేటాయిస్తారు.
- ➡ ఏప్రిల్ 27న మెరిట్ లిస్ట్, అదే రోజున ఎంపిక జాబితా వెల్లడించనున్నారు.
- ➡ ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.

**అర్హతలు :**

- ➡ 6వ తరగతిప్రవేశం పొందాలనుకునే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 01-09-2013 నుంచి 31-08-2015 తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో రూ.150 చెల్లించాలి.
- ➡ ఎస్సీ, ఎస్టీల కులాల విద్యార్థులు 01-09-2011 నుంచి 31-08-2015 తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. వీరు పరీక్ష ఫీజు రూ.75 చెల్లించాలి.
- ➡ ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2023-2024, 2024-2025 విద్యా సంవత్సరాలలో 4,5వ తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.

# వైభవంగా బడేసాహెబ్ తాత ఉరుసు

- వివిధ రాష్ట్రాల నుంచి లక్షకు పైగా తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన దర్గా



భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ సద్గురు బడేసాహెబ్ ఉరుసు మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉరుసు మహోత్సవం సందర్భంగా దర్గా భక్తులతో కిటకిటలాడింది. బడేసాహెబ్ తాత ముని మనవళ్లయిన పీఠాధిపతులు గురువారం తెల్లవారుజామున స్వామి వారికి గంధం తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. దర్గాలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులను వరుసలో పంపించి స్వామి వారికి ముజావర్లు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఉరుసు మహోత్సవానికి ఈ రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంత్రాల నుంచి దాదాపు లక్ష మందికి పైగానే భక్తులు హాజరయ్యారని నిర్వహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఉండేందుకు దర్గా నిర్వహకులు, ఆలయకమిటీ సభ్యులు గట్టి చర్యలు తీసుకున్నారు. దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పురుషులకు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు.

**ఆకట్టుకున్న మట్టిగాజులు, బొమ్మల దుకాణాలు**

ఉరుసులో మహిళలు, పిల్లలను, మట్టిగాజుల అంగళ్లు, బొమ్మల అంగళ్లు ఆకట్టుకున్నాయి. స్వామివారి దర్శనం అనంతరం అంగళ్ల దగ్గరే మహిళలు పెద్ద ఎత్తున గుమిగూడి గాజులను, బొమ్మలను విక్రయించారు. అలాగే రంగురాట్నాలు కూడ పిల్లలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**గట్టి పోలీస్ బందోబస్తు**

గంజిహళ్లి ఉరుసు మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర,గోనెగండ్ల సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో గట్టిబందోబస్తును ఏర్పాటుచేశారు. ఆర్‌టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.ఉరుసులో నాలుగురు సీఐలు, 6 మంది ఎస్ఐలు, 70 మంది పోలీసులు విధులు నిర్వహించారు.



స్వామి వారికీ గంధం తీసుకెళ్తున్న పీఠాధిపతులు

## మెనూ పాటించాలి



ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీతో మాట్లాడుతున్న ఎంఈఓ రామమూర్తి

పెద్దకడబూరు: కొత్త మెనూను కచ్చితంగా పాటించాలని మండల విద్యాధికారి రామమూర్తి సూచించారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి మాట్లాడారు. కొత్తగా వచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. లేనిపక్షంలో వంట ఏజెన్సీపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: గ్రామాల అభివృద్ధే తమ పార్టీ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ అమరేష్ అన్నారు. మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో మండల గ్రాంట్‌తో సిమెంటు రోడ్డు నిర్మాణానికి గురువారం మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామితో కలిసి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాల్లో ఎంతగానో అభివృద్ధి జరిగిందన్నారు. ఎంపీపీ అమరేష్ సొంత గ్రామమైన అగసలదిన్నెలో మండల గ్రాంట్ రూ.30లక్షలతో ఎస్సీ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారన్నారు. వారి వెంట కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు వెంకటరామిరెడ్డి, శివరాం, ఈరన్న, శ్రీకాంత్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

### పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఎస్‌ఏ-4 పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 రఘునాథ్

నందవరం: విద్యార్థులు ఇష్టంతో చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి-2 రఘునాథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ముగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ-4 పరీక్షను ఎంఈఓ -2 పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవకృపమ్మ, ఉపాధ్యాయులు సంజీవరాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.

## సీజనల్ హాస్టళ్లలో దోపిడీని అరికట్టండి

ఆదోని రూరల్: జిల్లాలోని సీజనల్ హాస్టళ్లలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని యూఎస్ఎఫ్ఐ, బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకులు ఉదయ్, శేఖర్ నాయుడు, ఆర్యన్, అశోక్ అన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, మంత్రాలయం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో డ్రాప్‌అవుట్స్ విద్యార్థుల కోసం ప్రభుత్వం 35 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి సీజనల్ హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించి ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం వడ్డించేందుకు ఒక్కో విద్యార్థికి రూ.1000 చెల్లిస్తోందన్నారు. అయితే సీజనల్ హాస్టళ్లలో 50 మంది విద్యార్థులకు గానూ రెండు, మూడు కిలోల వంట చేసి హాస్టల్ రికార్డుల్లో 95 శాతం వరకు హాజరైనట్లు చూపుతున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి



విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందజేస్తున్న ఎంఈఓ-2 నీలకంఠ

గోనెగండ్ల : పదో తరగతి చదివే విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులతో పాస్ కావాలని ఎంఈఓ-2 నీలకంఠ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థునులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు చదివిన ప్రతి అంశాన్ని సాధన చేయాలన్నారు. ఎవైన సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.